క్లుప్తంగా

సర్జరీ వైద్య పరికరాల అందజేత



సర్జరీ వైద్య పరికరాలను చూపిస్తున్న డాక్టర్లు

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు బుధవారం పలువురి దాతల ఆర్థిక సహకారంతో సర్జరీ వైద్య పరికరాలను అందజేశారు. పట్టణానికి చెందిన డాక్టర్ శివారెడ్డి, నడిమింటి శ్రీధర్, రూపనగుడి మధుసూదన్ రెడ్డి, సముద్రాల మురళీకృష్ణ, బొల్లవరం రామసుబ్బారెడ్డి, గోపిరెడ్డి రవీంద్రనాథరెడ్డి రూ. 52 వేలు విలువ చేసే ఎలక్ట్రోకాట్రి, సెక్షన్ మిషన్లను అందజేశారు. సీహెచ్‌సీకి సర్జరీ మిషన్లను సరఫరా చేసిన దాతలను ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్లు అభినవ్‌రెడ్డి, వెంకటలక్ష్మి, నవీన్‌రెడ్డి, వైద్య సిబ్బంది అభినందించారు.

విత్తన దుకాణాల తనిఖీ



స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ నిరంజన్

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని బుధవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలను ఇన్‌చార్జ్ ఏడీఏ నిరంజన్ తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిస్టర్లు, విత్తన స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ విత్తనాలు, రసాయన ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పని సరిగా రసీదు తీసుకోవాలని సూచించారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం

కోవెలకుంట్ల: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు ఏపీఓ శ్రీవిద్య తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలానికి వంద ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగుకు లక్ష్యం నిర్దేశించామన్నారు. మామిడి, చీని, నిమ్మ, సపోట, జామ తదితర పంటలు సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

వీఆర్ఏ అనారోగ్యంతో మృతి

బనగానపల్లెరూరల్: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన వీఆర్ఏ తలారి నాగేష(52) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. వీఆర్ఏల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నగేష్, మండల అధ్యక్షుడు తలారి బాలుడు ఆధ్వర్యంలో వీఆర్ఏలు మృతుడి ఇంటి వద్దకు వెళ్లి సంతాపం తెలిపారు. సంఘం తరుపున మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు రవి, శ్రీను, సుబ్బలచ్చమ్మ, నారాయణ, చెన్నప్ప, గ్రామ వీఆర్ఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన సదస్సు

డోన్ : ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పాదుపు కార్యాలయంలో హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రక్తదానంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ రక్తదానం ద్వారా మరొకరి ప్రాణం కాపాడిన వారమవుతామన్నారు. 18 నుంచి 50 ఏళ్ల వరకు ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మధుకుమార్, ఏపీఓ రామాంజనేయులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: మండల కేంద్రం అవుకులోని బుడగ జంగాల కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న జంబులమ్మ ఆలయ నిర్మాణానికి బుధవారం సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కాలనీ ప్రజల ఐకమత్యం అభినందనీయమన్నారు. కాలనీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

అర్బన్ హెల్త్ సెంటర్లు కళకళ!

- డోన్ నియోజకర్గంలో మూడు నూతన భవనాల నిర్మాణం
- కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా వసతుల కల్పన
- సంతోషం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు



డోన్ పాతపేటలో నిర్మించిన నూతన అర్బన్ హెల్త్‌సెంటర్



బేతంచెర్లలో నిర్మించిన అర్బన్ హెల్త్ క్లినిక్

డోన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతోపాటు 104,108 సేవలు విస్తతం చేసింది. అదే విధంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మారుమూల గ్రామాల్లోని ఇళ్ల వద్దకు సైతం డాక్టర్లు వెళ్లి అందజేస్తున్న వైద్య సేవల తీరుపై హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు కొత్తభవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోని అర్బన్ హెల్త్ సెంటర్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. నియోజకవర్గ కేంద్రం డోన్ రెండు, బేతంచెర్ల మండలంలో ఒక్కటి అర్బన్ హెల్త్ సెంటర్లు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రత్యేక చొరువతో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య సాగుతున్న అర్బన్ హెల్త్ సెంటర్లకు కొత్తభవనాలు మంజూరు చేయించారు. ఈ మేరకు ఒక్కోభవనానికి రూ. 90 లక్షలు చొప్పున మూడింటిని రూ. 2.70 కోట్లతో కొత్త భవనాలు పూర్తయ్యాయి. అధునాత వసతులతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్లు కళకళలాడుతున్నాయి.

అర్బన్ హెల్త్ సెంటర్లకు వెచ్చించిన మొత్తం

బేతంచెర్ల అర్బన్ హెల్త్ సెంటర్	రూ.90లక్షలు
డోన్ పాతపేట అర్బన్ హెల్త్ సెంటర్	రూ.90లక్షలు
డోన్ పాతబస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్	రూ.90లక్షలు

అన్ని వ్యాధులకు చికిత్సలు

కొత్త అర్బన్ సెంటర్ల నిర్మాణం చేపట్టిన ప్రభుత్వం అద్దెభవనాల్లో సాగుతున్న సెంటర్లలోనూ వైద్యసేవలు మెరుగు పరచింది. బీపీ, జ్వరం, వాంతులు, వీరేచనాలు తదితర 64 రకాల వ్యాధులకు చికిత్సలు అందజేయడంతోపాటు రోగులకు 170 రకాల మందులు అందజేసేలా చర్యలు చేపట్టింది. దీంతో అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రతిరోజూ 70 నుండి 100(ఓ.పి) వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారని సమాచారం. డోన్, బేతంచెర్ల పట్టణాల్లోని అర్బన్ హెల్త్ సెంటర్లు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉంటున్నాయి.

సత్వర వైద్యం



పట్టణాల్లో ప్రభుత్వాసుపత్రులు సుదూర ప్రాంతాలలో ఉంటాయి. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు అక్కడికి వెళ్లలేని పరిస్థితి. అయితే అర్బన్ హెల్త్ సెంటర్ల మూలంగా పట్టణ ప్రజలకు సకాలంలో సత్వరమే వైద్య సదుపాయం అందే అవకాశం ఉంది. వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయి.

– రామానాయుడు, ఇందిరానగర్, డోన్.

గర్భిణులకు వరం



అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రత్యేకించి గర్భిణులకు వరం లాంటిది. సమీపాన ఉన్నందున గర్భిణులు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా వెళ్లి వైద్య సేవలు పొందుతారు. ప్రజల్లోనూ ఆరోగ్య సమస్యలపై చైతన్యం వచ్చింది. అదేవిధంగా వృద్ధులు, పిల్లలకు అర్బన్ హెల్త్ సెంటర్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

– వెంకటేశ్వరమ్మ, 3వ వార్డు కౌన్సిలర్, డోన్.

దిశా యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



మహిళల ఫోన్‌లో దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తున్న పోలీస్ సిబ్బంది

అవుకు(కొలిమిగుండ్ల): ప్రభుత్వం మహిళల భద్రత కోసం దిశా యాప్‌ను ప్రవేశ పెట్టిందని, సద్వినియోగం చేసుకోవాలని కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని సచివాలయాల పరిధిలో ఉన్న మహిళా పోలీసులు బృందాలుగా ఏర్పడి దిశా యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వారి సెల్‌ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్‌చేసి వినియోగించే తీరును వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో దిశా యాప్ మహిళలకు రక్షణ కవచమన్నారు. ఏదైనా ఇబ్బందుల్లో ఉంటే యాప్ వాడితే ఏ ప్రాంతంలో ఉన్నా పోలీసులకు సమాచారం అందుతుందని, తద్వారా వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని రక్షించగలరని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు గఫూర్, పెద్దయ్య,హోంగార్డువెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పనిదినాల లక్ష్యాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి

అవుకు: ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం నిర్దేశించిన పని దినాల లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఏపీఓ అనీఫా ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రతి రోజు 4800 మంది కూలీలు పనుల్లో పాల్గొనాల్సి ఉందని, అయితే 3875 మంది పాల్గొంటున్నారన్నారు. కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. మిగిలిన వారిని కూడా పనులకు హాజరయ్యేలా వారికి అవగాహన కల్పించి, ప్రభుత్వ టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రజల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధదారుడికి బ్రోచర్ అందజేస్తున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

డోన్ టౌన్: రాష్ట్ర ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు దోహదపడుతున్నాయని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ తిరుమలరెడ్డి అన్నారు. మండలంలోని కొత్రాయి, గుండాల గ్రామాల్లో బుధవారం సర్పంచ్ ఆలంకొండ తేజోమని ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వివరాలు తెలియజేస్తూ బ్రోచర్లను అందజేసారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిడ్డారెడ్డి, వెంకటయ్య, అచ్చన్న, సుంకన్న, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



ద్రోణాచలం సేవాసమితి సభ్యులను మెమెంటోతో సత్కరిస్తున్న దృశ్యం

డోన్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కర్నూలు సర్వజన ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి ద్రోణాచలం సేవాసమితి సభ్యులను ఘనంగా సత్కరించారు. బుధవారం కర్నూలు ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో సేవాసమితి వ్యవస్థాపకులు శేర్షా, షాధిఖాన రాజును ఆయన మెమొంటోతో సత్కరించారు. ప్రతి ఏటా రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేసి ప్రభుత్వాసుపత్రికి అందజేస్తున్న నేపథ్యంలో ఆయన ద్రోణాచలం సేవా సమితి సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎం వెంకటేశ్వర్లు, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతలు పాల్గొన్నట్లు సన్మాన గ్రహీతలు తెలిపారు.

నేడు జగనన్న ఆణిముత్యాలు విద్యార్థులకు సత్కారం

డోన్ టౌన్: పదవ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాల కింద గురువారం సత్కరించి నగదు బహుమతులను అందజేస్తున్నట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు బుధవారం ఆయన తెలిపారు. అదేవిధంగా ఆయా ప్రాఠశాలల్లో హెచ్ఎంలు, ప్రిన్స్‌పాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించనున్నట్లు తెలిపారు. సన్మాన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకరంగా నిర్వహిస్తున్న జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బనగానపల్లె రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని పొదుపు భవనంలో గురువారం మండల స్థాయి జగనన్న ఆణిముత్యాల బహుమతుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు పేరుతో ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు.

వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

డోన్ టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు సకాలంలో విద్యుత్ కనెక్షన్ అందిస్తోందని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఈఈ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన సదస్సుతో ఎంపీపీ మాట్లాడారు. రైతులకు పగటి పూటనే 9గంటల విద్యుత్ సరఫరాను అందిస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి సాయిత్రం 5గంటల వరకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పంట పొలాల్లో విద్యుత్ వినియోగించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 11కేవీ విద్యుత్ లైన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈఈ రమణారావు, ఏఈ నాగేశ్వరరెడ్డి,జెఇ శివ, కృషిధర్‌రావు, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన అవుకు విద్యార్థులు

అవుకు: మండల కేంద్రం అవుకు పట్టణానికి చెందిన నలుగురు విద్యార్థులు నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం రాత్రి విడుదలైన నీట్ ఫలితాల్లో అవుకు పట్టణానికి చెందిన సూర వివేకనంద రెడ్డి నీట్‌లో 589 మార్కులు, తాలెపల్లె పల్లవి– 575, తాలెపల్లె పవిత్ర – 554, బేరి మహిత 538 మార్కులు సాధించారు. తమ పిల్లలు డాక్టర్లు అవుతున్నారని తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.

జనజాగృతి సభను జయప్రదం చేయండి

బేతంచెర్ల: విజయవాడలో జూలై 7వ తేదీన జరిగే మాదిగల జన జాగృతి సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా కన్వీనర్, కో కన్వీనర్లు రాజు, జీవన్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాముడు, సుంకన్న, సుధాకర్, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీ-20 దేశాల పాత్ర కీలకం

బనగానపల్లెరూరల్: ప్రపంచంలో జీ–20 దేశాలు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ కౌలస్యదేవి పేర్కొన్నారు. బుధ వారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు జీ–20 పెయింటింగ్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జీ–20 దేశాల ప్రాముఖ్యతను కౌసల్యదేవి విద్యార్థులకు వివరించారు. జీ–20 దేశాలు అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో ఎంతో కీలకంగా వ్యహరిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్ వహీదా, నాగ తిమ్మయ్య,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి నగర్‌కు చెందిన పఠాన్ నబీ ఖాన్ అనే యువకుడు అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 12వ తేదీన పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించగా.. అక్కడ చికిత్స పొందతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు

బనగానపల్లె: జిల్లా మార్క్‌ఫెడ్ నుంచి మండలంలోని ఆర్‌బీకేలకు ఇంత వరకు 180 మెట్రిక్ టన్నుల ఎరువులు చేరినట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. యూరియా 60 మెట్రిక్ టన్నులు, డీఏపీ 90 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 30 మెట్రిక్ టన్నులు చేరినట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కుగాను 4వేల మెట్రిక్‌టన్నులు ఇండెంట్ ఉన్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా 120 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ఉన్నాయని, 50శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు. కంది విత్తనాలను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు.

డాక్టర్ కావడమే లక్ష్యం



మేఘన (218 వ ర్యాంకు)

బనగానపల్లెరూరల్: ఏపీఈఏ సెట్ ఫలితాలు బుధవారం విడుదలైన నేపథ్యంలో బనగానపల్లె పట్టణానికి చెందిన ఎం మేఘన 218వ ర్యాంకు సాధించింది. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యార్థిని నీట్ ఫలితాల్లోనూ 612/720 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 20 వేల ర్యాంకు, ఓబీసీ కోటలో 9వేలు ర్యాంకు సాధించింది. డాక్టర్ కావడమే లక్ష్యమని ఈ సందర్భంగా ఎం మేఘన తెలిపారు.

ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి



ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన దృశ్యం

బేతంచెర్ల: రైతు సంక్షేమానికి ప్రభుత్వం అందించే తోడ్పాటును సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలీ, మైనార్టీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ ఖాజా హుసేన్ సూచించారు. బుధవారం పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో ది బేతంచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం నూతన కార్యాలయాన్ని అధ్యక్షుడు రుద్రవరం నారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులందరికీ ఇక్కడే నుంచి సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, రామ చంద్రుడు, నాగేశ్వర్ రెడ్డి, గూని నాగరాజు,ఖాజా, సలీమ్, క్రిష్టారెడ్డి, యాకోబ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్ద పీట

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారని, రైతుల బోరు బావులకు పగటి పూట నిరంతరాయంగా 9గంటల ఉచిత విద్యుత్ ను అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ ఏడీ మధు సూదన్‌రెడ్డి, రూరల్ ఏఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎక్కడా లోఓల్టేజీ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందజేయడం శుభపరిణామన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు ఉచితంగా మీటర్ బోర్డు, 15 మీటర్ల వైరు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్ కుమార్, గ్రామ సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్ : బుధవారం వెలువడిన ఏపీ ఎంసెట్ ఫలితాల్లో డోన్ విద్యార్థులు సత్తాచాటారు. డోన్ పట్టణంలోని మారుతి మెడికల్ స్టోర్ యాజమాని రాచంశెట్టి రవిశంకర్ శ్రీలక్ష్మీ దంపతుల కుమారుడు రాచంశెట్టి హర్షవర్దన్ 74వ ర్యాంక్ ర్యాంక్ సాధించాడు. గతంలోనూ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో హర్షవర్ధన్ ఉత్తమ ర్యాంక్‌సాధించాడు. ఈ సందర్భంగా సాక్షితో ర్యాంకర్ మాట్లాడుతూ మద్రాసు ఐఐటీలో సీఈసీ విభాగంలో సీటు సాధించడమే లక్ష్యం అన్నారు.

పెళ్లి చేసుకోవాలని వేధింపులు

కోవెలకుంట్ల: చదువుకున్న సమయంలో తీసుకున్న ఫొటోలను సాకుగా చూపిస్తూ పెళ్లి పేరుతో ఓ యువతిని వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. స్టేషన్ పరిధిలోని ఓ యువతి ఆరేళ్ల క్రితం నంద్యాలలో డిగ్రీ పూర్తి చేసుకుంది. డోర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన మక్బుల్ ఉసేన్ అనే యువకుడు అదే విద్యా సంవత్సరంలో డిగ్రీ చదువుకున్నాడు. చదువుకున్న రోజుల్లో కలిసి దిగిన ఫొటోలను దగ్గర పెట్టుకుని కొంతకాలం నుంచి పెళ్లి చేసుకోవాలని లేదంటే ఫొటోలను బంధువులు, కుటుంబ సభ్యులకు చూపిస్తానని యువతిని బెదిరిస్తున్నాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మక్బుల్ ఉసేన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎమ్మార్పీలకే విక్రయించాలి



దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ

డోన్ టౌన్: నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీల కంటే అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ అబ్దుల్ షఫి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామంలో ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్న ఆముదం, కందుల విత్తన ప్యాకెట్లను పరిశీలించి, బిల్లులు చెక్ చేశారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

బనగానపల్లె: రైతులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ఏడీఈ రామసుబ్బారెడ్డి సూచించారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రైతులతో బుధవారం పట్టణ ఏఈ శ్రీనివాసులుతో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏడీఈ వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలు, నిబంధనలను వివరించారు. రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న నెల రోజులకు మంజూరు చేస్తామని, మరో నెలలోపు కనెక్షన్ ఇస్తామని చెప్పారు.

వీపీఏలు రైతులకు అందుబాటులో ఉండాలి

అవుకు: గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ సూచించారు. బుధవారం పట్టణంలోని రైతుభరోసా కేంద్రంలో వీపీఏలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏఓ మాట్లాడారు. రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి చైతన్య పరచాలన్నారు. ప్రతి గ్రామంలోనూ పది మంది రైతుల పొల్లాల్లో భూసార పరీక్షలు నిమిత్తం మట్టి నమూనాలను సేకరించాలని ఆదేశించారు.

సమయపాలన పాటించాలి

అవుకు: సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అవుకు–1 గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. మూవ్‌మెంట్, అటెండెన్స్, సీఎల్ రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో అందుతున్న సేవలను, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ నుంచి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి

సంజామల: మనబడి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగకుమార్, ఎంఈఓ శివ జ్యోతి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. స్కూళ్లలో అభివృద్ధి పనులు నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు.

బస్సుపాస్ ఉచితం

సంజామల: మండల కేంద్రంలో పెండేకంటి పెద్ద వెంకటసుబ్బయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకునే వారికి రెండు సంవత్సరాలు ఉచిత బస్సు పాస్ సౌకర్యం దాతల సహకారంతో కల్పిస్తున్నామని ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెండేకంటి పెద్ద సుబ్బయ్య మనవడు పెండేకంటి కిరణ్ కుమార్ ఆర్థిక సాయంతో కానాల, గిద్దలూరు, పేరుసోముల ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థినీవిద్యార్థులు సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చేరితే రెండేళ్లు ఉచితంగా బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని, తెలుగు, ఇంగ్లిష్ మీడియం ఉందని తెలిపారు.

96.33 శాతం బీమా నమోదు

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో 96.33 శాతం బీమా నమోదు అయినట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. మొత్తం 25,887 మంది ఉండగా 24,937 మందిని బీమా నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల వరకు మండలంలో 96.33 శాతం నమోదైందని ఎంపీడీఓ పేర్కొన్నారు.